తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
మంగళవారం 2 జూన్ 2026 | పేజీలు : 08






## వర్షాకాల సన్నద్ధతపై హైడ్రా సమీక్ష

### సమన్వయంతో సమస్యల నివారణకు చర్యలు

- నీటి నిల్వలు, స్టార్మ్ వాటర్ డ్రైనేజీలపై దృష్టి
- ట్రాఫిక్ నిర్వహణ, చెరువుల భద్రతకు ప్రత్యేక ప్రణాళిక
- డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధం
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు

**శేరిలింగంపల్లి, జూన్ 01 (జనంసాక్షి):** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని హైడ్రా విభాగం అధికారులు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సోమవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎంసీ ఉన్నతాధికారులు, ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ, నీటిపారుదల శాఖ, విద్యుత్ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు, వాటి నివారణ మార్గాలు, అన్ని విభాగాల మధ్య సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన తీరు, అధికార యంత్రాంగం సామర్థ్యంపై క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులు అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రధానంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నీటి నిల్వ సమస్యలు, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థలు, ట్రాఫిక్ నిర్వహణ, చెరువుల భద్రతా మరియు పరిరక్షణ, ప్రజా రోగ్యం, ప్రజల భద్రతపై తీసుకోవాల్సిన చర్యలను



## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### నర్కుడలో ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు

**శంషాబాద్, జూన్1(జనం సాక్షి) :** పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.
సోమవారం శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ గృహాల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నర్కుడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ తో కలిసి నూతన గృహాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి, పూజా కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు ఇళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్ష గృహప్రవేశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో 3,144 ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు, సురక్షిత నివాసం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.సొంత ఇంటి కల నెరవేరినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె.చంద్రారెడ్డి, సి.మహేందర్ ముదిరాజ్, నీళ్ళ శ్రీధర్ గౌడ్, అధికారులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంట వ్యర్థాలను కాల్చడం చట్టరీత్యా నేరం


- నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
- వరి, మొక్కజొన్న గడ్డి కాల్చకూడదు
- నేల సారం, పర్యావరణం దెబ్బతింటాయి
- సుస్థిర ప్రత్యామ్నాయాలు అవలంబించాలి
- రైతులు హెచ్చరికలు పాటించాలని సూచన



లోపలి పేజీలో

## విద్యార్థుల భద్రతకు స్కూల్ బస్సుల్లో అన్ని భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకుండా బస్సులు నడపకూడదు
- డ్రైవర్లు చెల్లుబాటు లైసెన్స్‌తో అనుభవం ఉండాలి








లోపలి పేజీలో

## ఆల్ ఇండియా హాకీ టోర్నమెంట్‌లో ఎస్‌సీఆర్ పురుషుల హాకీ జట్టుకు రన్నరప్ ట్రోఫీ

# అన్నోజిగూడ నారాయణ కళాశాల సమీపంలో అక్రమ షెడ్డు నిర్మాణం



**పోచారం, జూన్ 1 ( జనం సాక్షి ):** పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ నారాయణ కళాశాల సమీపంలో నిర్మించబడిన భారీ షెడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ పనులు ప్రారంభమైన దశలోనే అధికారుల దృష్టికి విషయం వెళ్లినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్మాణానికి అవసరమైన మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అనుమతులు పొందకుండానే పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. నిర్మాణం పూర్తయ్యే దశకు చేరుకున్నప్పటికీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రధాన రహదారికి సమీపంలో నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని తరచూ ప్రకటించే అధికారులు, ఈ నిర్మాణం విషయంలో మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టినా వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు, భారీ స్థాయిలో నిర్మితమైన ఈ షెడ్డు విషయంలో చర్యలు తీసుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ఆమోద పత్రాలు ఉన్నాయా లేదా అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లు తేలితే బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పోచారం మున్సిపాలిటీ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో వివక్ష లేకుండా వ్యవహరించి ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# హబ్సిగూడ పెద్దచెరువు ట్యాంక్‌బండ్‌కు కొత్త సొబగులు



**హబ్సిగూడ, జూన్ 01 (జనం సాక్షి):** హబ్సిగూడలోని పెద్దచెరువు (పెద్దచెరువు) ట్యాంక్‌బండ్ సరికొత్త అలంకరణతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రూ. 71.6 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రత్యేక అభివృద్ధి పనులు పూర్తికావడంతో ఈ ప్రాంతం మరింత అందంగా, ఆహ్లాదకరంగా మారింది. చెరువు బండ్ వెంబడి విస్తృతంగా చేపట్టిన సుందరీకరణ పనులు సందర్శకులు, స్థానిక ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ట్యాంక్‌బండ్ పొడవునా వివిధ రకాల పూల మొక్కలు, అలంకార వృక్షాలు, రంగురంగుల క్రోటన్స్ నాటడంతో పచ్చదనం వెల్లివిరిసింది. ఈ హరిత వాతావరణం బాటసారులకు, వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతం మరింత మనోహరంగా కనిపిస్తూ ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. రద్దీగా ఉండే జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ చెరువు బండ్ నగర కోలాహలానికి దూరంగా ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తోంది. వేగంగా విస్తరిస్తున్న కాంక్రీట్ నగరంలో ఈ పచ్చని ప్రదేశం నగరవాసులకు ఒక విశ్రాంతి కేంద్రంగా మారింది. సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన ల్యాండ్‌స్కేపింగ్, మొక్కల అలంకరణ, శుభ్రత చర్యలు ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణను తీసుకువచ్చాయి. అభివృద్ధి పనుల అనంతరం పెద్దచెరువు ట్యాంక్‌బండ్ ఒక అందమైన నగర ల్యాండ్‌మార్క్‌గా రూపుదిద్దుకుంది. ఈ ప్రాంతం గుండా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు కాసేపు ఆగి ఆ అందాలను ఆస్వాదించేలా మారింది. ప్రకృతి అందాలు, ఆధునిక సుందరీకరణ కలయికతో హబ్సిగూడ పెద్దచెరువు ట్యాంక్‌బండ్ నగరంలో కొత్త ఆకర్షణగా నిలుస్తోంది.

# సొంతింటి కల నెరవేరినవేల...లబ్ధిదారుల ఆనందం

- సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు
- యాలాల్ మండల కేంద్రంలో ఆరుగురికి ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం.

**యాలాల జూన్ 1(జనంసాక్షి)** మండల కేంద్రంలో మంజూరైన నూతన ఇందిరమ్మ ఇండ్లకు సోమవారం రిబ్బన్ కటింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. పోస అశ్విని, ఎరుకల సుజాత, మెరుగు యాదమ్మ, సంధ్య, గళ్ళ సాయమ్మ, న్యా దిర్గకళ్యాణి లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిహెచ్. శివయ్య లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపసర్పంచ్ మల్లిరెడ్డి శోభ రాజు రెడ్డి, గ్రామపంచాయతీ సెక్రటరీ ఆనంద్ రాం, 12వ వార్డ్ నెంబర్ ఉమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, కార్యదర్శి హైమద్, సహాయ కార్యదర్శి గొల్ల చందు, మైను, గడ్డం రాము గౌడ్, బుర్లపూరి నర్సిములు, హన్మంతు, మ్యాదరి వేణు, పోస లాలు, గొల్ల శ్రీనివాస్, ఎరుకలి ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారుల ఆనందం...సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, యాలాల మండల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి చొరవతో తమకు ఇండ్లు మంజూరయ్యాయని, వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతోందని గ్రామ పెద్దలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న ఆర్బిఐఎల్ సీఈఓ శ్రీనివాసరెడ్డి దంపతులు



**తాండూరు జూన్ 1(జనంసాక్షి)** తాండూర్ మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామ శివారులో కొలువుదీరిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని ఆర్బిఐఎల్ సంస్థ సీఈఓ బుయ్యని శ్రీనివాసరెడ్డి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న శ్రీనివాసరెడ్డి దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలదండతో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాండూర్ నియోజకవర్గ ప్రజలందరూ ఎల్లప్పుడూ సుఖశాంతులతో, చల్లగా ఉండాలని, ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బోరు మోటార్ ప్రారంభం



**కేశంపేట, జూన్ 1 (జనం సాక్షి ) :** మండల పరిధిలోని కొత్తపేట గ్రామ శ్రీ హనుమాన్ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం వద్ద ఆర్ డబ్ల్యూ ఎస్ డీఈ అబ్దుల్ బారీ తో కలిసి గ్రామ సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్ నూతన బోరు మోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా హైమావతి జగదీశ్వర్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఎస్ డి ఎఫ్ నిధులు మూడు లక్షల రూపాయలతో ఆలయానికి వచ్చే భక్తులు, ప్రజలకు నీటి కొరత తలెత్తకుండా నూతనంగా బోరు వేయించి త్రి ఫేజ్ మోటారును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి గ్రామ పాలకవర్గంతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. వివిధ కాలనీలలో నీటి ఎద్దడి తలెత్తకుండా సింగిల్ ఫేజ్ మోటార్లను బిగించామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని సర్పంచ్ అన్నారు. బోర్ వేయించాలని కోరిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్ లకు ఐదవ వార్డు సభ్యులు పుట్నాల అనూష రాజు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగన్, వార్డు సభ్యులు కాడెమోని జంగయ్య, కంటం యాదయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వట్టెల ఆంజయ్య, నాయకులు రంగు శంకర్, నిర్దవెల్లి జంగయ్య, మామిడి యాదయ్య గౌడ్, లెంకపోతుల కుమార్ గౌడ్, పుట్నాల కృష్ణయ్య, అక్బర్, రమేష్,మల్లేష్, కారోబార్ జంగయ్య పాల్గొన్నారు.

# తాండూర్ డిపో సిబ్బంది ఎర్ర బ్యాడ్జీలతో నిరసన




**తాండూరు జూన్ 1జనంసాక్షి)** రాష్ట్ర వ్యాప్తంగా టీఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వద్ధామ రెడ్డి పిలుపు మేరకు ముందు విలీనం ఆ తర్వాతే ఏదైనా అనే నినాదంతో ఆర్టీసీ ఉద్యోగులు సోమవారం నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి డిపోలో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తాండూర్ డిపో సిబ్బంది సైతం ఎర్ర బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ కార్యక్రమం చేపట్టినట్లు టీఎంయూ నాయకులు తెలిపారు. విలీనం అంశంపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని, దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉద్యోగ సంఘాలు తెలిపాయి. తాండూర్ డిపోలో కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎర్ర బ్యాడ్జీలతో సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోద్దీన్ , అంజిలయ్య మరియు తదితర నాయకులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేసవిలో సహజ హైడ్రేషన్‌కు రియల్ యాక్టివ్ కొబ్బరి నీరు

**ఖైరతాబాద్, జూన్ 01 (జనం సాక్షి ) :** దేశ వ్యాప్తం గా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో డాబర్ తన రియల్ యాక్టివ్ కొబ్బరి నీరును మార్కెట్ లోకి దుదల చేసినట్లు డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ మయాంక్ కుమార్ సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఫుడ్స్ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ మోనిషా ప్రశర్ తోకలసి ఆయన మాట్లా దుతూ అదనపు చక్కెర లేకుండా, సహజ ఎలక్ట్రోలైట్‌లతో కూడిన ఈ పానీయం వేసవిలో శరీరానికి తేమను అందిస్తూ సహజ హైడ్రేషన్ పానీయంగా పనిచేస్తుందని అన్నారు. రియల్ యాక్టివ్ కొబ్బరి నీరు అలసటను తగ్గించి, హైడ్రేషన్‌కు మద్దతు ఇస్తుందని, జీర్ణక్రియతో పాటు చర్మ ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుందని అన్నారు. చక్కెరతో కూ డిన కార్బోనేటెడ్ పానీయాలకు ప్రత్యామ్నాయంగా 100 శాతం కొబ్బరి నీటి గుణాలతో ఈ ఉత్పత్తిని అందిస్తున్నామని చెప్పారు.

# బీఆర్ఎస్ బలోపేతానికి బూత్ కమిటీలే కీలకం

### ఘట్కేసర్ సర్కిల్ బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశంలో నాయకుల పిలుపు



ఘట్కేసర్, జూన్ 1 ( జనం సాక్షి ): మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం సోమవారం అన్నోజిగూడలోని తులిప్స్ గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఘట్కేసర్ మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, చామకూర మహేందర్ రెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతంలో బూత్ కమిటీ సభ్యుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ కార్యక్రమాలను గ్రామాలు, కాలనీల స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాబోయే రాజకీయ పరిణామాలు, పార్టీ కార్యాచరణ, ప్రజల్లో పార్టీ ప్రభావాన్ని పెంచే వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో పోచారం మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, కొడే పోచయ్య, శ్యామల శ్రీనివాస్, ఆకుల మధుకర్, సురేందర్ రెడ్డి, నల్లవెల్లి శేఖర్, రమేష్, పన్నాల కొండల్ రెడ్డి, మాధవరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సామల సందీప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డ్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు కీలక శాఖతో మంత్రి పదవి ఇవ్వాలి

### తలారి శశికాంత్



**కోట్‌పల్లి, జూన్ 01 (జనంసాక్షి):** వికారాబాద్ ఎమ్మెల్యే, తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోట్‌పల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తలారి శశికాంత్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రసాద్ కుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దళితులు, బలహీన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతోనే సూచిస్తున్నట్లు తెలిపారు. అనుభవం ఉన్న నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేనేత, జౌళి శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ప్రసాద్ కుమార్‌కు ఉందని శశికాంత్ గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై ఆయనకు ఉన్న అవగాహన తెలంగాణ రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆయన కృషి అవసరమని అన్నారు. పార్టీకి కట్టుబడిన నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారని శశికాంత్ అన్నారు. రాజకీయ జీవితంలో ఎన్నో అవకాశాలు వచ్చినా ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా కాంగ్రెస్‌నే నమ్ముకుని ప్రజల కోసం పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. విధేయత, నిజాయితీకి మారుపేరైన ఆయనకు పార్టీ అధిష్ఠానం తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యకర్తల ఆకాంక్ష స్పీకర్ హోదాలో రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తున్నప్పటికీ, మంత్రిగా ఉంటే ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఉంటుందని ఎస్సీ సెల్ నాయకులు అభిప్రాయపడ్డారు. వికారాబాద్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు కూడా ప్రసాద్ కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతున్నాయని తెలిపారు. కీలకమైన శాఖతో కూడిన మంత్రి పదవిని ప్రసాద్ కుమార్‌కు ఇవ్వాలని, తద్వారా సామాజిక సమతుల్యత పాటించాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని, పార్టీ అధిష్ఠానాన్ని కోరారు.

# బంట్వారంలో 15వ రోజు కొనసాగుతున్న విఓఏల సమ్మె



**వికారాబాద్, జూన్ 1 (జనంసాక్షి):** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బంట్వారం మండలంలోని గ్రామ సంఘాల సహాయకులు (ఉూాలు) చేపట్టిన నిరవధిక సమ్మె 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉూాలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లుతూ వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉూాలు ప్రధానంగా కనీస వేతనం రూ. 20,000 అమలు చేయాలని, తమను సెర్ప్ (రాజు౯్రా) ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హత కలిగిన ఉూాలకు కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా (జజలు) పదోన్నతులు కల్పించాలని, రూ. 20 లక్షల వరకు సాధారణ మరియు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. విధుల నిర్వహణ కోసం ట్యాబ్ సౌకర్యం అందించడంతో పాటు, జి.ఓ. నెం. 58ను సవరించాలని కూడా వారు డిమాండ్ చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఉూాలు స్పష్టం చేశారు. ఈ సమ్మెలో మశ్చందర్, మహేందర్, ఆశీరెడ్డి, ప్రవీణ్, మొల్లప్ప, ఇందిర జ్యోతి, సునంద, లలిత, జయమ్మ, మాధవి, నరేందర్, మల్లేశం, రామకృష్ణ, రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తున్నామని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సమ్మెలో పాల్గొంటున్న నాయకులు, సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# పీర్జాదిగూడలో ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం



**బోడుప్పల్-జనంసాక్షి** పీర్జాదిగూడలో నిర్వహించిన బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి. ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ,బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయి. యువత మన ఆచారాలను, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉంది. భక్తులందరికీ బీరప్ప స్వామి ఆశీస్సులు లభించి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కుర్ర శ్రీకాంత్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### నాగోల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా

# ఏ.సంపత్ బాధ్యతల స్వీకరణ



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 1(జనం సాక్షి ):** నాగోల్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా ఏ. సంపత్ సోమవారం పెద్ద అంబర్‌పేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏ. సంపత్ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని నూతన డిప్యూటీ కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

# ఉప్పల్- మెహదీపట్నం మార్గంలో రోడ్డు ప్రమాదం



**ఉప్పల్ జూన్ 01 ( జనం సాక్షి ) :** ఉప్పల్ నుంచి మెహదీపట్నం వైపు వెళ్తున్న మార్గంలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులను ఎక్కించేందుకు ఆగిన ఆర్టీసీ బస్సును వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటంతో కారు ముందుభాగం (ఇంజిన్ పోర్షన్) పూర్తిగా బస్సు కిందకు వెళ్లిపోయింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయి తీవ్రంగా దెబ్బతింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, ఇతర వాహనదారులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా? ఎంతమంది ప్రయాణికులు ఉన్నారు? అనే వివరాలు ఇంకా అధికారికంగా తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, గాయపడిన వారి పరిస్థితి, ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టిన తర్వాత మరింత సమాచారం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# కోర్టు ఆదేశాలు పాటించండి

### మాజీ సర్పంచుల నేత కె. రాజిరెడ్డి



**పరిగి జూన్ 01 జనం సాక్షి ):** గ్రామల అభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులను మాజీ సర్పంచులకు వాయిదాల ప్రకారం చెల్లించాలని హై కోర్టు స్పష్టం చేసినందున డీపీవో లకు స్పష్టం అయినా ఉత్తర్వులు ఇవ్వాలని దోమ మండల సర్పంచుల సంగం మాజీ అధ్యక్షులు కె.రాజిరెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసారు బకాయిల చెల్లింపుల కోసం సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి కీ సోమవారం రాష్ట్ర సర్పంచుల ఐకాస పిలుపు మేరకు దోమలో సర్పంచుల నేత రాజిరెడ్డి నీ గృహ నిర్భంధం చేసి ఎక్కడ వెళ్ళవద్దని ఎస్ఐ వసంత్ జాదవ్ కోరడంతో రాజిరెడ్డి ఒక ప్రకటనలో మాట్లాడారు మాజీ సర్పంచుల ఇబ్బందులను ద్రుష్టి లో పెట్టుకొని వాయిదాల ప్రకారం బిల్లులు చెల్లించాలని 2025/ లో హై కోర్టు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖకు ఉత్తర్వులు ఇచ్చింది కానీ కోర్టు ఉత్తర్వులు ఇంప్లిమెంట్ చేయడంలో ప్రభుత్వ పెద్దలు ఆశాఖ రాష్ట్రస్థాయి కోర్టు కాపీ నీ డీపీవో లకు పంపి గ్రామ పంచాయతీ లకు వచ్చే నిధులను పాత బకాయిలు ఎ పద్దతి లో చెల్లించాలి స్పష్ట మైన ఉత్తర్వులు ఇవ్వలేదు అని అన్నారు అధికారులు చొరవ తీసుకోనీ పాత సర్పంచులకు బాకీలు వాయిదాల పద్దతిలో నైనా చెల్లించేలా చొరవ తీసుకోవాలని రాజిరెడ్డి కోరారు.

## తాండూరులో కీలక సమస్యలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే బీఎంఆర్ సమీక్ష



**తాండూరు జూన్ 1(జనంసాక్షి)** నియోజకవర్గం లోని పలు సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి (బీఎంఆర్) కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా అధికారులతో ఈ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీఎంఆర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహించాలి , ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు, సిబ్బంది కొరత డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి సమీక్ష జరిపారు. కలెక్టర్ దీపక్ తివారి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏసీఎల్‌బీ ఉమా శంకర్ ప్రసాద్, ఏసీ రెవెన్యూ వెంకటేష్ తో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- జర్నలిస్టులను ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీంలో చేర్చాలి
- వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి
- ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలో ఫీజు రాయితీ కల్పించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య
- రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 1(జనం సాక్షి )** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచన మంచి పరిణామని, అదే క్రమంలో ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు కూడా సేకరించి ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య ప్రభూత్వాన్ని కోరారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం అబ్దులాపూర్ మెట్ మండల కేంద్రంలోని వి. వి బ్యాంకెట్‌హాలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య, జిల్లా అధ్యక్షులు శేరిబాయి గణేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి మైల సైదులు, కోశాధికారి శ్రీనివాస్ చారి, నేషనల్ కమిటీ సభ్యులు దేవేందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు గణేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బసవ పున్నయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఫిల్డ్ జర్నలిస్టుల విషయంలో ఎలాంటి కొర్రిలు పెట్టకుండా కార్డులు ఇచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీం జాబితాలో జర్నలిస్టులను చేర్చాలన్నారు. ఇండ్ల జాగాల విషయంలో హైదరాబాద్ కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇచ్చేందుకు చేస్తున్న ఆలోచనలో భాగంగా ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు జిల్లా జర్నలిస్టుల వివరాలు సేకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరల్నిస్టుల పిల్లల ఫీజు రాయితీ విషయంలో ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ఖచ్చితంగా ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో రాయితీ ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు, డీఈవోలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. వెంకటేశ్, మణికుమార్ , రఘునంధన్ గౌడ్, సుధర్శన్ గౌడ్, శ్రీనివాస్ , నర్సింహ్మా, రాజశేఖర్ , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యాదగిరి, జిల్లా ప్రచార కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ పులిపలుపుల శివ కుమార్ గౌడ్ , జిల్లా కమిటీ సభ్యులు శ్రీశైలం, అంజి, నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, రఘవేందర్ గౌడ్, రాజు, జైచందర్ , శంకర్, బుచ్చయ్య, జర్నలిస్టులు మల్లేష్, యాకుబ్ పాష, తదితరులు పాల్గొన్నారు.

# ఫీర్జాదిగూడలో కనుల పండుగగా బీరప్ప స్వామి కల్యాణం

### పాల్గోన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,ఎగ్గే మల్లేశం,క్యామ మల్లేశం



**బోడుప్పల్-జనంసాక్షి:** బోడుప్పల్ సర్కిల్ ఫీర్జాదిగూడ మిని ట్యాంక్ బండ్ వద్ద సోమవారం శ్రీ బీరప్పస్వామి, కామరాతిదేవిల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. కురుమ కుల ఆచారం మేరకు ఒగ్గు కళాకారులు ఒగ్గు కథ చెప్పారు. ఆలయం నుంచి స్వామివారిని ఉదయం పదిన్నర గంటలకు గద్దెపైకి చేర్చి కల్యాణం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్రప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం,కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల ఆచార వ్యవహారాలను సంరక్షించుకునేందుకు కురుమలు తరచూ ఇలాంటి ఉత్సవాలు జరపడం అభినందనీయమని అన్నారు. అదేవిధంగా బీరప్పస్వామి పండగకు పురాతన కాలం నుంచి ఎంతో ప్రాధాన్యత ఉందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కొమరవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ చేవెళ్ళి సంపత్ కురుమ, దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ కంకల ఏలేందర్ కురుమ,సభ్యులు మంగ వెంకటేష్ కురుమ,మరాటి మల్లేష్ కురుమ,గొరిగె నర్సింహ్మ కురుమ,యూత్ కాంగ్రెస్ నాయకులు ఆసర్ల బీరప్ప కురుమ,తెలంగాణ సిద్దు కురుమ,నిర్వాహకులు జోగు సోమలింగం కురుమ,జోగు సోమేష్ కురుమ,మరాటి శివేందర్ కురుమ,కేమిడి సత్యనారాయణ కురుమ,నకిర్త అమర్నాద్ కురుమ,బాల్దె మహేందర్ కురుమ తదితరులు పాల్గోన్నారు.

# యాచారం గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే పెద్దపీట

### రూ. 2 కోట్లకు పైగా నిధులు మంజూరు



**యాచారం, జూన్ 1(జనం సాక్షి )** యాచారం గ్రామ సమగ్ర అభివృద్ధికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పెద్దపీట వేశారు. గ్రామంలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 2 కోట్లకు పైగా నిధులను మంజూరు చేసినట్లు యాచారం గ్రామ సర్పంచ్ మస్కు అనిత శరణం ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామపంచాయతీ పరిధిలోని మొగుల్లవంపు రోడ్డు నిర్మాణానికి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని, ఇందుకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయని ఆమె పేర్కొన్నారు. అలాగే గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా రూ. 3 లక్షల నిధులు కేటాయించారని వెల్లడించారు. ఈ నిధులతో మోటార్లు, పైప్‌లైన్ మరమ్మతు పనులను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు గ్రామానికి సరిపడా మిషన్ భగీరథ నీటిని అందించేలా అధికారులతో ఎమ్మెల్యే సానుకూలంగా మాట్లాడారని సర్పంచ్ వివరించారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కూడా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిరంతరం యాచారం గ్రామ ప్రగతికి కృషి చేస్తున్న సర్పంచ్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## కొంపల్లి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్




**నిజాంపేట్ జూన్ 1( జనం సాక్షి )** సిఎంసీ, కొంపల్లి సర్కిల్--56 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ప్రజల నుండి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 3 వినతి పత్రాలు (అప్లికేషన్లు) స్వీకరించబడినవి. ముఖ్యంగా అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని వినతి. ఉమా మహేశ్వరి కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి. పాండు బస్తీలో మంజూరైన కల్వర్టు పనులను తక్షణమే ప్రారంభించవలసిందిగా వినతి. అనంతరం డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ స్వీకరించిన వినతులను సంబంధిత శాఖ అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకొని, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ తెలిపారు.

## పల్లె ప్రకృతి వనం దుస్థితి

### యేన్కేపల్లిలో ఎండిన చెట్లు పట్టించుకోని అధికారులు



**కోట్ పల్లి జూన్ 01(జనంసాక్షి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన “పల్లె ప్రకృతి వనం” పథకం యేన్కేపల్లి గ్రామంలో అధ్వాన్న స్థితికి చేరింది. పచ్చని చెట్లతో కళకళలాడాల్సిన వనం నేడు ఎండిపోయిన మొక్కలు, పగిలిన ఇటుకలతో దర్శనమిస్తోంది. గ్రామ ప్రవేశంలో ఏర్పాటు చేసిన “పల్లె ప్రకృతి వనము, యేన్కేపల్లి గ్రామము” అనే నామఫలకంతో కూడిన ఇనుప గేటు తెరిచే ఉంది. లోపలికి వెళ్లి చూస్తే నిర్వహణ లేక వనం మొత్తం బీడు భూమిని తలపిస్తోంది. నాటిన మొక్కల్లో చాలా వరకు నీళ్లు లేక ఎండిపోయాయి. కొన్ని చెట్లకు ఆకులు లేకుండా మోడులా మారాయి. చుట్టూ ఉన్న కంచె కూడా పలుచోట్ల పడిపోయింది. ప్రారంభంలో అధికారులు వచ్చి మొక్కలు నాటి ఫొటోలు తీసుకెళ్లారు. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. నీళ్లు పోసే దిక్కులేదు, కాపలా లేదు అని గ్రామస్తులు వాపోతున్నారు. వనం కోసం కేటాయించిన నిధులు ఏమయ్యాయని వారు ప్రశ్నిస్తున్నారు. పథకం లక్ష్యం నీరుగారెనా గ్రామాల్లో పచ్చదనం పెంచడం, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే పల్లె ప్రకృతి వనాల ముఖ్య ఉద్దేశం. కానీ యేన్కేపల్లి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఎండిన చెట్లు, చెత్తాచెదారం, శిథిలావస్థలో ఉన్న ప్రవేశ ద్వారం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి వనాన్ని పునరుద్ధరించాలని, మొక్కలకు నీరు, సంరక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో పల్లె ప్రకృతి వనం పథకం కేవలం నామఫలకానికే పరిమితమయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అక్రమ కేసు పెట్టారని

### ఎస్సైపై కోర్టుకెళ్లిన జనసేన మండల్ అధ్యక్షుడు రామకృష్ణ



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి)** జిల్లేడు చౌదరి గూడ జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ తనపోలంవద్ద 816సర్వే నెంబర్ లో ఇతరులు వచ్చి వరిసేను పాడుచేయడం జరిగిందని పేర్కొన్నారు పొలం పాడుచేయడమే కాకుండా తనపై దాడి చేయడం జరిగిందని తెలిపారు వారు ఇచ్చిన పిటిషన్ తీస్కొని తనపై అక్రమంగా కేసు చేయడం జరిగిందని తను ఇచ్చిన పిటిషన్ తీరష్కరించి అక్రమంగా ఎసై విజయ్ కేసు పెట్టారాని కోర్టుకెలారు.దర్యాప్తు చేసి నిజానిర్ధారణ చేసి ఇతరులపైన కూడా కేసు పెట్టాలని కోర్టునుంచి ఆర్డర్ తీసుకొచ్చారు. ఎసై విజయ్ నీ వివరన్నకొరగా తన తీసుకొచ్చిన ఆర్డర్ కాపీ స్వీకరించి దర్యాప్తు చేసి ఇతరులపై కేసు నమోదు చేస్తానని తెలిపారు.

# ప్రజావాణికి 24 దరఖాస్తులు

## అత్యధికంగా 11 టౌన్ ప్లానింగ్



**మల్కాజిగిరి జూన్ 01(జనంసాక్షి)** మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. జోనల్ పరిధిలోని వివిధ సర్కిళ్ల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలపై బాధితులు మొత్తం 24 దరఖాస్తులను అధికారులకు సమర్పించినట్లు జోనల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఫిర్యాదులలో అత్యధికంగా మల్కాజిగిరి, మౌలాలి సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించినవి 11 ఉండటం గమనార్హం. ఇంజనీరింగ్ 06 ఎలక్ట్రికల్ 03 శానిటేషన్ 03 యుబిడి 1 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను మల్కాజిగిరి జోనల్ కమిషనర్ ఆదేశించారు.

# ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ డే ప్రకటించాలి

- కుషాయిగూడ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ బ్యాడ్జీలతో నిరసన
- జూన్ 2నే ప్రకటించాలని డిమాండ్



**కాప్రా, జూన్ 01 (జనం సాక్షి ) :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ జూన్ 2ను అపాయింటెడ్ డేగా వెంటనే ప్రకటించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కుషాయిగూడ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో డిమాండ్స్ డేను ఘనంగా నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు బ్యాడ్జీలు ధరించి పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. విలీనానికి సంబంధించి అపాయింటెడ్ డే ప్రకటించడంలో జాప్యం చేయకుండా జూన్ 2నే అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన హక్కులు, సర్వీస్ ప్రయోజనాలు కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు సుబ్రహ్మణ్యం, ఉపేందర్, సోమయ్యతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# కోట్‌పల్లి మండలం జూనియర్ అసిస్టెంట్‌గా విజయ్ భాస్కర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**కోట్‌పల్లి జూన్ 01 (జనంసాక్షి):** కోట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతనంగా నియమితులైన జూనియర్ అసిస్టెంట్ విజయ్ భాస్కర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి విజయ్ భాస్కర్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. అనంతరం విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, మండల ప్రజలకు పారదర్శకంగా, అంకితభావంతో సేవలందిస్తానని తెలిపారు. కార్యాలయంలో



పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరిస్తానని, కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరినీ మర్యాదగా ఆదరిస్తానని హామీ ఇచ్చారు.

# రామంతపూర్‌లో రోడ్డు ప్రమాదం.. ట్రక్ ఢీకొట్టడంతో వాహనాలు ధ్వంసం

**రామంతపూర్, జూన్ 1 (జనం సాక్షి):** రామంతపూర్‌లోని గుడ్డే రెస్టారెంట్, బార్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మద్యం మత్తులో ఉన్నట్లు అనుమానిస్తున్న ఓ ట్రక్ డ్రైవర్ అతివేగంగా వాహనం నడుపుతూ రోడ్డుపై వెళ్తున్న కారు, మూడు ద్విచక్ర వాహనాలను వరుసగా ఢీకొట్టాడు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో రహదారిపై రద్దీ ఎక్కువగా ఉండటంతో మరింత పెద్ద ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం ప్రకారం, ట్రక్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ రహదారిపై వెళ్తున్న ఇతర వాహనాలను ప్రమాదకర రీతిలో ఓవర్‌టేక్ చేస్తూ ముందుకు సాగాడు. ఈ క్రమంలో వాహనంపై నియంత్రణ కోల్పోయి ముందుగా ఓ కారును ఢీకొట్టాడు. అనంతరం అదుపు తప్పిన ట్రక్ వరుసగా మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో అవి రోడ్డుపై పడిపోయి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాదం జరిగిన క్షణాల్లో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు, వ్యాపారులు, ప్రయాణికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలు కాగా, మరికొందరికి స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది. గాయపడిన యువకుడిని స్థానికుల సహకారంతో వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. అతడికి తలకు, కాళ్లకు గాయాలైనట్లు సమాచారం. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంలో చిక్కుకున్న ఇతరులకు కూడా ప్రాథమిక చికిత్స అందించినట్లు తెలిసింది. ప్రమాదం తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, మూడు ద్విచక్ర వాహనాలు కూడా వినియోగానికి వీలులేని స్థితికి చేరుకున్నాయి. వాహనాల శకలాలు రహదారిపై చెల్లాచెదురుగా పడిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనగా, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటన అనంతరం ట్రక్ డ్రైవర్ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు స్థానికులు తెలిపారు.




అయితే అప్రమత్తమైన స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన ట్రక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ప్రమాద సమయంలో ట్రక్ వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం, ఇతర సాంకేతిక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను సేకరించి పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్లే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత విస్తృతంగా నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. రామంతపూర్ వంటి రద్దీ ప్రాంతాల్లో భారీ వాహనాల వేగ నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రమాదం మరోసారి రోడ్డు భద్రతా నిబంధనల ప్రాముఖ్యతను గుర్తు చేసింది. నిర్లక్ష్యంగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# రంగారెడ్డి జిల్లా నూతన డీఈఓ వెంకటేశ్వర్లుకు 'తపస్' జిల్లా బృందం శుభాకాంక్షలు



**ఇబ్రహీంపట్నం, జూన్ 1(జనం సాక్షి )** రంగారెడ్డి జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు ని 'తపస్' రంగారెడ్డి జిల్లా బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా నూతన డీఈఓ కి తపస్ డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా బాధ్యులు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, ఎల్లప్పుడూ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ జిల్లాలో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించడానికి తోడ్పాటు అందించాలని డీఈఓ వెంకటేశ్వర్లు ని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశి రావు, పూజరి రమేశ్, రాష్ట్ర బాధ్యులు సత్తారి రాజిరెడ్డి, యుగంధర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పున్న రమేశ్, అబ్బాయ్, ఆదర్శన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు కాలే శ్రీశైలం,. కరుణాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పట్నం కృష్ణ, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వడ్ల రాజేందర్, భాస్కర్ గౌడ్, రత్నా రెడ్డి, మర్యాద రవీందర్ మరియు తపస్ ఇబ్రహీంపట్నం మండల మీడియా కన్వీనర్ పొట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి కాలనీలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 1(జనం సాక్షి ):** అబ్దుల్లాపూర్‌మెట్ మండల చిన్న రావిరాల గ్రామపంచాయతీ పరిధిలోని విశ్వశాంతి కాలనీలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, ఉప సర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండారి అనిత, ఆకిటి రామకృష్ణారెడ్డి, అభవతి బాలయ్య, రాపోలు మల్లేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొమురెల్లి రేణుక, కడవేరు శ్రీనివాసరావు, గండికోట శారద, అశోక్, గ్రామ సెక్రటరీ సునీతతో పాటు గ్రామ పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. గృహప్రవేశం సందర్భంగా కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



# కాప్రా డిప్యూటీ కమిషన్‌గా బాధ్యతలు చేపట్టిన రవీందర్ సాగర్



**కాప్రా, జూన్ 1 (జనంసాక్షి ) :** కాప్రా సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా రవీందర్ సాగర్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీహరి జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ బదిలీ అయ్యారు. దీంతో నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్ గా పనిచేస్తున్న రవీందర్ సాగర్ సోమవారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్గా పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ రవీందర్ సాగర్ మాట్లాడుతూ కాప్రా సర్కిల్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

# కమలానగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఎల్లారెడ్డి చేసిన సేవలు మరువలేనివి



**కాప్రా, జూన్ 1 (జనంసాక్షి) :** కమలానగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఎల్లారెడ్డి అందించిన సేవలు మరువలేనివని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ పేర్కొన్నారు. సీనియర్ పౌరుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి, సంఘం అభివృద్ధికి అందించిన సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. అసోసియేషన్ నిర్వహించిన వివిధ సామాజిక, సేవా కార్యక్రమాల్లో ఎల్లారెడ్డి చురుకుగా పాల్గొని సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని రాజేశ్వర్ తెలిపారు. ఆయన సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు సంఘానికి ఎంతో ఉపయోగపడ్డాయని కొనియాడారు. ఎల్లారెడ్డి సేవలు సంఘ సభ్యులకు ఆదర్శప్రాయమని, ఆయన జ్ఞాపకాలు ఎల్లప్పుడూ తమతోనే ఉంటాయని రాజేశ్వర్ పేర్కొన్నారు. ఆయన సమాజానికి అందించిన సేవలను కమలానగర్ ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని అన్నారు. పార్థసారథి,దశరథ,రమేష్ యాదవ్,వెంకటేశ్వర్లు, చారి లు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

# కల్లు కాంపౌండ్ లో కార్మికుడు అనుమానాస్పద మృతి



**శంషాబాద్, జూన్1(జనంసాక్షి) :** శంషాబాద్ మండలం జుకాల్ గ్రామానికి చెందిన కథుల మైసయ్య (50) అనే కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి కలకలం రేపింది. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం, మైసయ్య గత మూడు నెలలుగా గ్రామానికి చెందిన పగడాల నరేష్ గౌడ్‌కు చెందిన కల్లు కాంపౌండ్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పనికి వెళ్లిన మైసయ్యను సాయంత్రం సమయంలో హరికృష్ణ గౌడ్, లింగం గౌడ్‌లు బైక్‌పై ఇంటి వద్దకు తీసుకువచ్చి పడుకోబెట్టి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతసేపటి తర్వాత మైసయ్య స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆర్ఎంపీ వైద్యుడిని పిలిపించగా, పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడి భార్య కథుల మాణెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# అత్తాపూర్ రోడ్డు సమస్యలపై ప్రజావాణిలో వినతి



**రాజేంద్రనగర్, జూన్1 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అత్తాపూర్ సర్కిల్ పరిధికి చెందిన స్థానిక ప్రజలు రోడ్ల దుస్థితిపై అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ ఎల్.పి. మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రాంతంలోని ప్రధాన రహదారులు, కాలనీల అంతర్గత రోడ్లు గుంతలతో దెబ్బతిన్నాయని, వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రోడ్ల మరమ్మతులు చేపట్టి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డీసీ హామీ ఇచ్చారు.

# సిఎంసి పరిధిలో ప్రజావాణి కార్యక్రమం

## సమస్యల పరిష్కారం పై అధికారుల ప్రత్యేక దృష్టి



**శేరిలింగంపల్లి, జూన్ 01 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. అధికారులు నేరుగా అర్జీదారులతో ముఖాముఖి సమావేశం అవుతుండడంతో ఫిర్యాదు దారులలోసైతం అంతే స్పందన కనిపిస్తుండడం విశేషం. కార్యక్రమంలో భాగంగా పౌరులు తమ సమస్యలు, సూచనలు మరియు అభ్యర్థనలను నేరుగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంద్వారా పౌరులు సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యక్షంగా మాట్లాడి తమ సమస్యలకు పరిష్కారం కోరుతుండడం ఆహ్వానించదగ్గ పరిణామం. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి 60 ఫిర్యాదులు అందినట్లు అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. వీటిని సంబంధిత అధికారులకు బదిలీ చేసి వాటి పరిష్కారం కోసం కార్యాచరణను నిర్దేశించడం జరిగింది. ఇందులో భాగంగా పౌరులు టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ఎన్నికలు, అర్బన్ బయోడైవర్సిటీ, విద్యుత్, ప్రజా సౌకర్యాలు మరియు ఇతర పౌర సేవలకు సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు ఆయా అధికారులు ప్రత్యేక ట్రాకింగ్ ఐడి ని కేటాయించారు. దీని ద్వారా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం మరియు సమర్థవంతమైన పర్యవేక్షణను నిర్ధారించనున్నట్లు వారు తెలిపారు. సిఎంసి ఉన్నతాధికారులు ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించాలని , క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని, పౌరుల సమస్యలను ప్రాధాన్యతగా పరిగణించాలని క్రింది స్థాయి అధికారులకు సూచించడం జరిగింది. ఫిర్యాదులకు సంబంధించి చేపట్టిన చర్యలపై క్రమం తప్పకుండా పురోగతి వివరాలు అందించాలని, పూర్తిస్థాయి పరిష్కారం జరిగే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం విశేషం. ఫిర్యాదుల పరిష్కారంలో క్షేత్రస్థాయి తనిఖీలు, శాఖల మధ్య సమన్వయం మరియు వేగవంతమైన చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలనిసైతం సూచించినట్లు తెలిసింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పౌరుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా సమర్థవంతమైన సేవలందింపుకు కట్టుబడి ఉన్నామని సీఎం అధికారులు మీడియాకు తెలియజేశారు.

# మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ ప్రాంతాలపై ప్రభుత్వం వివక్ష

**బొమ్మ ఉపేంద్రనాథ్ రెడ్డి**



**రాజేంద్రనగర్, జూన్1 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ ప్రాంతాల ప్రజల పట్ల ప్రభుత్వం వివక్షతతో వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకుడు బొమ్మ ఉపేంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 80 వేల మంది ఓటర్లు ఉన్నప్పటికీ కేవలం రెండు కార్పొరేటర్ స్థానాలు మాత్రమే కేటాయించారని, అదే సమయంలో నార్సింగ్ ప్రాంతంలో 35 వేల మంది ఓటర్లకు మూడు కార్పొరేటర్ స్థానాలు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన అన్నారు. పుప్పాలగూడ ప్రాంత ప్రాధాన్యతను తగ్గించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో కూడా స్పష్టమైన వివక్ష కనిపిస్తోందని ఉపేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. నార్సింగ్ ప్రాంతంలో 198 మంది లబ్ధిదారులకు అవకాశం కల్పించగా, మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ ప్రాంతాలను కలిపి కేవలం 100 మందికి మాత్రమే అవకాశం ఇవ్వడం ఈ ప్రాంత ప్రజల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వానికి, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు ఈ ప్రాంతాల ప్రజలంటే ఎందుకు చిన్నచూపో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాల విషయంలో వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాలకు అన్యాయం జరుగుతున్న సమయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన నాయకులు స్పందించకపోవడం బాధాకరమని ఉపేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడమే కాకుండా ప్రజల సమస్యలపై పోరాడాల్సిన బాధ్యత కూడా నాయకులపై ఉందన్నారు. మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ ప్రాంతాల ప్రజలకు సమాన న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీక రాష్ట్ర అవతరణ : నిరుడు శేఖర్



**రాజేంద్రనగర్,జూన్1(జనంసాక్షి) :** జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాకుండా కోట్లాది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, అమరవీరుల త్యాగాలు, విద్యార్థులు, యువత, రైతులు, ఉద్యోగుల పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి భారతీయ జనతా పార్టీ మొదటి నుంచే మద్దతు తెలిపిందని అన్నారు.ప్రత్యేక తెలంగాణ కోసం పార్లమెంట్‌లో మాజీ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ బలంగా గళం వినిపించి తెలంగాణ ప్రజల్లో నమ్మకం, ధైర్యం నింపారని గుర్తు చేశారు. తెలంగాణ బిల్లు ఆమోదంలో బీజేపీ కీలక పాత్ర పోషించిందని చెప్పారు.అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధి చెందాలని, యువతకు ఉపాధి, రైతులకు భరోసా, పేదలకు సంక్షేమం అందే సమాజ నిర్మాణమే నిజమైన తెలంగాణ స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూ రాష్ట్ర ప్రజలందరికీ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# పంట వ్యర్థాలను కాల్చడం చట్టరీత్యా నేరం

**యాచారం, జూన్ 1 (జనంసాక్షి):** పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి, మొక్కజొన్న గడ్డి వంటి పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల నేల తల్లి ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని యాచారం మండల వ్యవసాయ అధికారి రవినాథ్ హెచ్చరించారు. పొలాలను త్వరగా శుభ్రం చేసుకోవాలనే ఆరాటంతో చాలామంది రైతులు గడ్డిని కాలుస్తున్నారని, దీనివల్ల స్వల్పకాలంలో సమయం, శ్రమ ఆదా అయినా... దీర్ఘకాలంలో వ్యవసాయానికి కోలుకోలేని నష్టం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల నేలలోని విలువైన సేంద్రియ కార్బన్ నశించి, నేల సారహీనంగా మారుతుందని తెలిపారు. అంతేకాకుండా కాల్చడం వల్ల ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలకు మట్టిని సారవంతం చేసే వానపాములు, ప్రయోజనకరమైన బ్యాక్టీరియా, శిలీంధ్రాలు వంటి మిత్రజీవులు చనిపోయి నేల జీవ చైతన్యాన్ని కోల్పోతుందని వివరించారు. గడ్డిని కాల్చడం వల్ల పంటకు అవసరమైన నత్రజని, గంధకం వంటి ప్రధాన పోషకాలు వాయువుల రూపంలో వాతావరణంలోకి ఆవిరైపోతాయని, దీనివల్ల రైతులు రసాయన ఎరువులపై అదనంగా ఆధారపడాల్సి వస్తుందని పేర్కొన్నారు. పదేపదే నిప్పు పెట్టడం వల్ల నేల గట్టిపడి నీటిని పీల్చుకునే శక్తిని కోల్పోతుందని, తేమ లేక భూమి త్వరగా ఎండిపోయి నీటిపారుదల అవసరం పెరుగుతుందని చెప్పారు. ఇది విత్తనాల మొలక, వేర్ల అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. కేవలం నేల ఆరోగ్యమే కాకుండా, గడ్డిని కాల్చడం వల్ల కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి విష వాయువులు విడుదలై పొగమంచు ఏర్పడుతుందని, ఇది మానవులలో శ్వాసకోశ సమస్యల కు దారితీస్తుందని హెచ్చరించారు. పంట వ్యర్థాలను కాల్చడం చట్టప్రకారం నేరమని గుర్తు చేస్తూ, రైతులందరూ పర్యావరణాన్ని, భూసారాన్ని కాపాడే సుస్థిర పద్ధతులను అవలంబించి దీర్ఘకాలిక లాభాలు సాధించాలని పిలుపునిచ్చారు. పంట అవశేషాలను పొలం ఉపరితలంపైనే వదిలేయడం (మల్చింగ్) ద్వారా తేమను కాపాడుకోవ చ్చని, లేదా రోటవేటర్‌తో మట్టిలోనే కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవచ్చని సూచించారు. బయో-డీకంపోజర్ స్ప్రేలను వాడటం ద్వారా వ్యర్థాలను సహజంగా, వేగంగా కుళ్ళింపజేయవచ్చని తెలిపారు. అలాగే 'హ్యాపీ సీడర్' లేదా 'సూపర్ సీడర్' వంటి ఆధునిక యంత్రాల సహాయంతో గడ్డిని కాల్చాల్సిన అవసరం లేకుండానే నేరుగా తదుపరి పంట విత్తనాలను వేసుకోవచ్చని రైతులకు వివరించారు.

# తలకొండపల్లి ఎంపీడీవోగా సీతా రామమ్మ బాధ్యతలు స్వీకరణ



**తలకొండపల్లి జూన్ 01(జనంసాక్షి):**
తలకొండపల్లి నూతన ఎంపీడీవోగా సీతారామమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ పనిచేస్తున్న శ్రీకాంత్ నాయక్ షాద్ నగర్ (ఫరూక్ నగర్) కు బదిలీ కాగా మెదక్ జిల్లాలోని టెక్మల్ మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎం.సీతారామమ్మ సోమవారం తలకొండపల్లి నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండల కార్యాలయ అధికారులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా మండలంలోని గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మంది బదిలీ కాగా ఖాళీగా ఉన్న15 పంచాయితీ కార్యదర్శులకు గాను సోమవారం సాయంత్రం వరకు అధికారికంగా 11 మంది పంచాయితీ కార్యదర్శులు విధులలో చేరినట్లు ఎంపీఓ లక్పతి నాయక్ తెలిపారు.చుక్కాపూర్ లో విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ కేశంపేట మండలంలోని చౌల్లపల్లి,కి బదిలీ కాగా అతని స్థానంలో నూతనంగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు.చీపునుంతలలో విధులు నిర్వహిస్తున్న యాదగిరి కడ్తాల్ మండలంలోని బాలాజీ తండాకు బదిలీ కాగా అతని స్థానంలో చిరంజీవి చరణ్ తేజ్ బాధ్యతలు చేపట్టారు.గౌరిపల్లి,లో విధులు నిర్వహిస్తున్న నరసింహ మాడుగుల మండలంలోని చంద్రాయన్ పల్లికి బదిలీ కాగా అతని స్థానంలో నూతనంగా అమర జ్యోతి,లింగారావుపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఫారుక్ నగర్ మండలంలోని కందివనంకు బదిలీ కాగా అతని స్థానంలో నూతనంగా మహేష్,పడమటి తండా ప్రశాంతి అమనగల్ మండలంలోని మేడిగడ్డ తండాకు బదిలీ కాగా ఆమె స్థానంలో నూతనంగా మురారి అమ్మ,రాంపూర్ రమేష్ నాయక్ కడ్తాల్ మండలంలోని నార్లకుంట తండాకు బదిలీ కాగా నూతనంగా రవీందర్,వెంకటాపూర్ తండా అశ్లేష రెడ్డి ఫారుక్ నగర్ లోని దూసుకల్లు కు బదిలీ కాగా అతని స్థానంలో నూతనంగా శ్రీనివాస్,వెంకట్రావుపేట జమీరుద్దీన్ ఫారుక్ నగర్ లోని పీర్లగూడకు బదిలీ కాగా అతని స్థానంలో నూతనంగా రజనీకాంత్,కోరింతకుంట తండా శ్రీశైలం ఫారుక్ నగర్ లోని కడియాల కుంట తండాకు బదిలీ అయ్యారు.అదేవిధంగా ఇంచార్జితో కొనసాగుతున్న గట్టు ఇప్పలపల్లి గ్రామానికి రవికాంత్ చారి,మాదాయ పల్లి,కి వివేక్ వర్ధన్,పడకల్ కు రమాదేవి,లు పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు.



# ఆల్ ఇండియా హాకీ టోర్నమెంట్‌లో ఎస్‌సీఆర్ పురుషుల హాకీ జట్టుకు రన్నరప్ ట్రోఫీ...

**సికింద్రాబాద్(జనం సాక్షి):** తమిళనాడులోని కోవిల్ పట్టిలో మే 21 నుంచి 30 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా హాకీ టోర్నమెంట్‌లో దక్షిణ మధ్య రైల్వే పురుషుల హాకీ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. టోర్నమెంట్ లీగ్ దశలో ఎస్‌సీఆర్ జట్టు కర్ణాటక, తమిళ నాడు జట్లపై విజయాలు సాధించి తదుపరి దశకు అర్హత సాధించింది. అనంతరం క్వార్టర్ ఫైనల్లో పంజాబ్ అండ్ సింధు బ్యాంక్ జట్టును 4-2 తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీ ఫైనల్లో ఇండియన్ ఆర్మీ జట్టుతో తలపడిన ఎస్‌సీఆర్, ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా 3-0 స్కోరుతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో ఇండియన్ నేవీ జట్టుతో ఎస్‌సీఆర్ తలపడింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలవడంతో విజేతను నిర్ణయించేందుకు షూటౌట్ నిర్వహించారు. షూటౌట్‌లో నేవీ జట్టు 4-3 తేడాతో విజయం సాధించగా, ఎస్‌సీఆర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. టోర్నమెంట్ మొత్తం మీద ఎస్‌సీఆర్ హాకీ జట్టు క్రమశిక్షణ తో కూడినఆటతీరు, సమిష్టి ప్రదర్శనతో ఆకట్టుకుని జాతీయ స్థా యిలో దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్ఠను మరింత పెంచింది. ఫైనల్‌లో స్వల్ప తేడాతో టైటిల్‌ను కోల్పోయినప్పటికీ, జట్టు ప్రదర్శన క్రీడాభిమానుల ప్రశంసలను అందుకుంది.

# వర్షాకాల సన్నద్ధతపై హైడ్రా

చర్చించారు. సైబరాబాద్ పరిధిలో గుర్తించిన ప్రధాన నీటి నిల్వ ప్రాంతాలు, సమస్యాత్మక రహదారులు, భారీగా వర్షాలు పడినప్పుడు ప్రభావితమయ్యే ప్రాంతాలను ప్రత్యేకంగా సమీక్షించారు.భారీ వర్షాల సమయంలో నీటి నిల్వలను తగ్గించేందుకు నిరంతర పర్యవేక్షణతో పాటు క్షేత్రస్థాయిలో సమన్వయ చర్చలు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. స్టార్మ్ వాటర్ డీ-సిల్టింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయడం, వర్షపు నీరు ఫ్రీగా పారడానికి ఉన్న అడ్డంకులను తొలగించడం, డ్రైనేజీ వ్యవస్థలో ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

వర్షాకాలంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా అక్కడికక్కడే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధాన చెరువులు, నాళాలు ఇతర వనరుల పరిస్థితిని సమీక్షించి వరద ముంపు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణను కొనసాగించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు, ఫీల్డ్ సిబ్బంది, పంపింగ్ యంత్రాలు, అత్యవసర పరికరాలు, పటిష్టమైన వ్యవస్థలను సిద్ధం చేసుకోవాలని అధికారులు ఎత్తిచూపారు.

# విద్యార్థుల భద్రతకు స్కూల్ బస్సుల్లో అన్ని భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

**ఉప్పల్, జూన్ 01 (జనంసాక్షి):** విద్యార్థుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా భావిస్తూ ప్రతి స్కూల్ బస్సుకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) పి. విద్య తెలిపారు. పాఠశాలలకు చెందిన అన్ని వాహనాలు రవాణా శాఖ నిబంధనలకు అనుగుణంగా నడపబడాలని, వాహనాల నిర్వహణలో యాజమాన్యాలు ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని సూచించారు.

స్కూల్ బస్సులు సాంకేతికంగా సక్రమ స్థితిలో ఉండటంతో పాటు విద్యార్థుల భద్రతకు అవసరమైన అన్ని సౌకర్యాలు కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు. బస్సుల్లో ఫిట్‌నెస్ సర్టిఫికేట్, అత్యవసర నిష్క్రమణ తలుపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరాలు, ఎమర్జెన్సీ కాంటాక్ట్ వివరాలు మరియు ఇతర భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రతి వాహనాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేసి లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు.

అదేవిధంగా స్కూల్ బస్సుల డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌తో పాటు తగిన అనుభవం కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆమె పేర్కొన్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. విద్యార్థుల రవాణా సమయంలో డ్రైవర్లు, సహాయక సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఫిట్‌నెస్ లేని లేదా భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలను రోడ్లపై నడపడం చట్టవిరుద్ధమని, అలాంటి వాహనాలపై రవాణా శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఎంవీఐ పి. విద్య స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో రాజీ పడకుండా అన్ని నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

విద్యార్థులు సురక్షితంగా పాఠశాలకు చేరుకోవడం, తిరిగి ఇంటికి చేరుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్న ఆమె, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ప్రయాణించే స్కూల్ బస్సుల భద్రతా ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థుల భద్రతే లక్ష్యంగా రవాణా శాఖ తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు.




# దక్షిణ మధ్య రైల్వే మహిళల బాస్కెట్‌బాల్ జట్టు జాతీయ ఛాంపియన్ ట్రోఫీ

సికింద్రాబాద్(జనంసాక్షి): : తమిళనాడులోని కోయంబత్తూర్‌లో మే27 నుంచి 31 వరకు నిర్వ హించిన ఆల్ ఇండియా బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో దక్షిణ మధ్య రైల్వే మహిళల బాస్కెట్‌బాల్ జట్టు విజేతగా నిలిచి ప్రతిష్ఠాత్మక ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. టోర్నమెంట్ అంతటా అద్భు త ప్రదర్శన 1కనబరిచిన ఎస్‌సీఆర్ జట్టు, వరుసగా సెంట్రల్ రైల్వే , 1ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, సౌత్ వెస్ట్రన్ రైల్వే, కేరళ పోలీస్ జట్లపై విజయాలు సాధించి ఫైనల్‌కు చేరుకుంది.వ 1ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు జట్టుతో తలపడిన ఎస్‌సీఆర్ మహిళల జట్టు నిర్ణీత సమయంలో 49-49 స్కోరుతో సమంగా నిలిచింది. అనంతరం నిర్వహించిన అదనపు ఐదు నిమిషాల ప్లే-ఆఫ్‌లో మెరుగై న ఆటతీరును ప్రదర్శించి విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. టోర్నమెంట్‌లో ఎస్‌సీఆర్ జట్టు తరఫున అద్భుత ప్రతిభ కనబరిచిన హర్షిత బోపయ్య కు మోస్ట్ ప్రామిసింగ్ ప్లేయర్ అవార్డు లభించింది. ఆమె ప్రదర్శన జట్టు విజయానికి కీలకంగా నిలిచినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ విజయంతో దక్షిణ మధ్య రైల్వే మహిళల బాస్కెట్‌బాల్ జట్టు జాతీయ స్థాయిలో తన ప్రతిభను మరోసారి చాటుకొని క్రీడారంగంలో సంస్థకు గర్వకారణంగా నిలిచింది.